# అరలు

"నీకు,

"నిన్ను ఎలా సంబోధించాలో తెలియక 'నీకు' అంటున్నాను. నీ ఉత్తరం అందింది. ఇన్ని సంవత్సరాల తర్వాత నీ నుండి ఉత్తరం అందుకున్నందుకు సంతోషపడలేదు. నిన్ను అసహ్యించుకోవడం మానేసి చాలా కాలమయింది. మనసులోంచి నిన్ను తుడిచేసుకున్నాను. అన్నయ్య, నాన్న కూడా అంతే చేశారు. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే నా చిరునామా నీకు ఎలా దొరికిందని! దయచేసి ఇహ నాకు ఎప్పుడూ ఉత్తరాలు రాయకు. ఫ్రం అడ్రసు చూడకుండా పొరపాటు చేసి నీ ఉత్తరం చదివాను. నేను ఈ చిన్న వయసులో కేన్సరు ఆస్పత్రిలో చనిపోయినా చూడడానికి రాకు. అంతకన్నా నిన్నేమీ కోరను.

"నువ్వు నన్ను కన్న తల్లివే. కాదనడం లేదు. నాకూ అన్నయ్యకు కొంత కాలం పాటు అమ్మగా ఉన్నావు. ఎక్కడ ఏమయిందో తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తి ఎప్పుడూ కలగలేదు. మనువు ఇష్టం లేనప్పుడు మృగతృష్ణలో మమ్మల్ని కనకుండా ఉండవలసింది.

"పత్రికల్లో కవితలు, వ్యాసాలు, కథలు, ప్రచారం కోసం తపిస్తున్న మహానుభావుల ఇంటర్వ్యూలు, ఆధ్యాత్మిక రచనలు ఇంకేవేవో రాస్తూంటావని విన్నప్పుడు నా కడుపులో చేయిపెట్టి దేవినట్టు అనిపించింది. అందరి మాట అలా ఉంచుతాను. నీ మాటకు నీకు చిత్తశుద్ధి లేదు. మనస్సాక్షిని నిలువెత్తు గుంటలో తవ్వి పాతేశావు. నువ్వు చెప్పేదేదో నువ్వే ఆచరించవు. నీ గురించి నువ్వెందుకు ఏడ్వవు?

"నీ ఉత్తరంలో చిన్నప్పటి మాటలు గుర్తు చేశావు. చూచాయగా కూడా గుర్తులేదు. మనసు శూన్యం అయిపోవడం ఎంత అదృష్టం! మరీ ముఖ్యంగా నీ విషయంలో? నా చిన్న తనంలో నాకేదయినా తినిపిస్తూ ఇలా అనేదానివని రాశావు.

బి.పి.కరుణాకర్

"నేను కల్పనను, నిన్ను కన్న తల్లినే, కల్పనను....

"పాలలో చెక్కెర కలపనా?"

"మిఠాయి కలపనా?"

"జున్ను కలపనా?"

"ప్రేమ కలపనా?"

"నేనమ్మా నీ కల్పనను" చాలా రాసుకుంటూ వచ్చావు.

గుప్పెడు ముద్దలో చిటికెడు విషం కలిపి ఉంటే ఎంత బావుణ్ణు అనిపించింది.

"నువ్వు బతకాలి, క్షేమంగా ఉండాలి. మరో భర్తతో పిల్లలున్నారు. వాళ్లకోసమయినా నువ్వు బతకాలి. ఒక్కమాట చేతులు జోడించి బతిమిలాడుతున్నాను ఎవరి బాల్యాన్నీ హరించి అభాగ్యులను చేయకు... ప్లీజ్

ఇట్లు
ఏమీకాని
నేను".

* ఆదివారం వార్త, 6 జూన్2010